ఉత్తమ సేవలకు గుర్తింపు

రాష్ట్ర స్థాయిలో జగిత్యాల టీ డయాగ్నోస్టిక్ హబ్‌కు అయిదో స్థానం

ప్రశంసలు అందుకుంటున్న ఉద్యోగులు



జగిత్యాల టీ డయాగ్నోస్టిక్స్ సెంటర్ భవనం

జగిత్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పేదలకు ఉచిత వైద్య పరీక్షలు అందుబాటులోకి తీసుకొని రావడానికి జగిత్యాలలో ఏర్పాటు చేసిన టీ డయాగ్నోస్టిక్స్ హబ్ ఉత్తమమైన సేవలు అందిస్తూ ప్రశంసలు పొందుతోంది. జగిత్యాల టీ డయాగ్నోస్టిక్స్ హబ్ సేవలు అందించడంలో రాష్ట్ర స్థాయిలో అయిదవ స్థానంలో నిలిచింది. గత నెలలోనూ ఇదే తరహాలో జగిత్యాల కేంద్రం రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. జిల్లాతో పాటు మంచిర్యాల, నిజామాబాద్ జిల్లాల పరిధి లోని 33 ఆరోగ్య కేంద్రాలకు సేవలను అందిస్తూ తనదైన గుర్తింపును సొంతం చేసుకుంది.

రాష్ట్రంలో అయిదో స్థానంలో..

వైద్య ఆరోగ్య శాఖ జిల్లాల వారీగా ఉత్తమమైన సేవలందించిన కేంద్రాల వివరాలను వెల్లడించగా అందులో జిల్లా అయిదవ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో మంచిర్యాల, రెండవ స్థానంలో జోగులాంబ గద్వాల. మూడవ స్థానంలో మెదక్, నాలుగవ స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలు నిలవగా జగిత్యాల తదుపరి స్థానాన్ని కేవసం చేసుకుంది.

ప్రభుత్వ ఆసు పత్రుల్లో రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు చేయడంతో పాటు సకాలంలో ఫలితాలు అందజేయడంలో జగిత్యాల మెరుగైన స్థానంలో నిలిచింది. గత నెలలో రాష్ట్ర స్థాయిలో మెదక్ మొదటి స్థానంలో జోగులాంబ గద్వాల రెండవ స్థానంలో నిలవగా జిల్లా మూడవ స్థానంలో నిలిచింది. వరసగా రెండు నెలలు రాష్ట్రంలో స్థాయిలో మెరుగైన స్థానంలో ఉండడంతో డయాగ్నోస్టిక్స్ ఉద్యోగులు ఉన్నతాధి కారుల ప్రశంసలను అందుకుంటున్నారు.

జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్ ఆరోగ్య కేంద్రాలకు సేవలు..

జిల్లాలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా జిల్లా ఏరియా ఆసుపత్రి, మాతా శిశు సంరక్షణ కేంద్రం, కోరుట్ల, రాయికల్, ధర్మపురి, మెట్‌పల్లిలలో వైద్య విధాన పరిషత్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లతో పాటు ఆయా మండ లాల్లో 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఏడు 24 గంటలు పనిచేసే ఆసు పత్రులు, 5 బస్తీ దావాఖానలు, 5 అర్బన్ హెల్త్ సెంటర్లకు జగిత్యాలలో ఏర్పాటు చేసిన డయాగ్నోస్టిక్స్ సెంటర్ సేవలు అందిస్తోంది. వీటికి తోడు మంచిర్యాల జిల్లాలోని జన్నారం పీహెచ్‌సీ, నిజామాబాద్ జిల్లాలోని కమ్మ రిపల్లి, చౌట్‌పల్లి పీహెచ్‌సీలలో ఉన్న రోగులకు కూడా పరీక్షలు చేసి రోగ నిర్ధారణ ఫలితాలను అందిస్తున్నారు.

రూ. 3 కోట్ల నిధులతో ఏర్పాటు...

జగిత్యాల జిల్లా కేంద్రంలోని దరూర్ క్యాంపులో మూడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం రూ. 3 కోట్ల నిధులతో టీ డయాగ్నోస్టిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. టీ డయాగ్నోస్టిక్స్ హబ్‌లో అత్యాధునిక సుమారు పది పరికరాలను ఏర్పాటు చేశారు. కేంద్రంలో ఎనిమిది మంది ల్యాబ్ టెక్నిషి యన్స్, ఒక డాటా ఎంట్రీ ఆప రేటర్, మేనేజర్‌తో పాటు ఇన్‌చార్జిలను నియ మించింది. బీపీ, షుగర్, మూత్ర పిండాలు, కాలేయం, గుండె, థైరాయిడ్, రక్త నమూనాలు, చికున్ గున్యా, డెంగ్యూ ఇలా పలు రకాల జబ్బులకు పైసా ఖర్చు లేకుండా పరీక్షలను చేసి ఫలితాలను అందిస్తోంది.

24 గంటల్లోపే రోగి మొబైల్‌కు ఫలితాలు...

ఒకే చోట 112 రకాల జబ్బులకు రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలను తీసుకవచ్చిన నమూనాలను డయాగ్నోస్టిక్స్ కేంద్రానికి తీసుకవచ్చి 24 గంటల్లోపే ఫలితాలను ఆన్‌లైన్ విధానం ద్వారా రోగి మొబైల్‌కు పంపుతున్నారు. వివిధ రోగాలతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు భారం కాకుండా టీ డయాగ్నోస్టిక్స్‌లో ఉచిత సేవలను అందిస్తున్నారు. జిల్లాలోని ఆయా మండలాలను అయిదు రూట్లుగా విభజించి అయిదు వాహనాల్లో ప్రతీ రోజు నమూనాలను టీ డయాగ్నోస్టిక్స్‌కు చేరవేస్తున్నారు. 24 గంటల్లోపు పరీక్ష ఫలితాలను ఆన్‌లైన్ విధానంలో అందిస్తున్నారు.

సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

డాక్టర్ నీలారపు శ్రీనివాస్, నోడల్ ఆఫీసర్, టీ డయాగ్నోస్టిక్స్ సెంటర్



జగిత్యాల టీ డయాగ్నోస్టిక్స్ కేంద్రంలో అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. కేంద్రంలో క్షయ పరీక్ష కూడా అందుబాటులో తేవడానికి ప్రయత్నిస్తున్నాము. గత యేడాది ఎంపిక చేసిన కేంద్రాల్లో ఆరోగ్య మహిళ రక్త నమూనాలను సైతం ఇక్కడి తీసుకవచ్చి రోగ నిర్ధారణ పరీక్షలు చేసి ఫలితాలను అందిస్తున్నాము.

అత్యాధునిక పరికరాలతో ఏర్పాటు

డాక్టర్ సంజయ్ కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల



జగిత్యాలలో అత్యాధునిక పరికారాలతో టీ డయాగ్నోస్టిక్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు రోగ నిర్ధారణ పరీక్షలు భారం కాకుండా ఉండేందుకు ఉచితంగా పరీక్షలను ప్రభుత్వం నిర్వహి స్తోంది. ఇరవై నాలుగు గంటలల్లోపు పరీక్ష ఫలితాలను నేరుగా రోగుల మొబైల్‌కు అందిస్తున్నాము.

పాఠశాలలో పనులు వేగంగా పూర్తి చేయాలి

కలెక్టర్ సత్యప్రసాద్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల, జూలై 12 : అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా మంజూరైయిన నిధులతో చేస్తున్న అభివృద్ధి పనులను వేగవంగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్య ప్రసాద్ అధికారులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని కాగజ్‌పుర కాలనీలోని ఉర్దు మీడియం పాఠశాలను కలెక్టర్ పరిశీలించి చేస్తున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సంఖ్యతో పాటు గత సంవత్సరం విద్యార్థుల ఉతీర్ణత శాతంను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో రోజువారి రిజిస్ట్రార్‌ను పరిశీలించారు. అనంతరం తరగతి గదిలలో ఉన్న విద్యార్థులను కలిసి ఉపాధ్యాయుల బోదించే విధనంపై ఆరా తీసారు. ఉర్దూ మీడియం చదివే విద్యార్థులను తెలుగు భాషలో ఉన్న పరిజ్ఞానం తెలుసుకోవడానికి వివిధ అంశాలపై ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో డీఈవో జగన్ మోహన్‌రావు, మండల విద్యాధికారి నరేశం, తహసీల్దార్ కిషన్, కమీషనర్ తిరుపతిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జగిత్యాలఅర్బన్, జూలై 12: రాష్ట్రంలో ఉన్న పెండింగ్ స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఇచ్చిన ఛలో కలెక్టరేట్ పిలుపుమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రే విద్యాశాఖకు మంత్రిగా ఏడు నెలల కాలంలో ఒక్క సమీక్ష నిర్వహించకుండా, విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఏడు నెలల వ్యవధిలో కూడా విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం, సమీక్షలు చేయకపోవడం ఈ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. 2019 నుంచి 2024 వరకు సుమారు 8214.57 కోట్ల రూపాయల బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో అటు విద్యార్థులు, ఇటు కళాశాలల యాజ మాన్యాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కుంటున్నారన్నారు. తక్షణమే పెండింగ్ ఉపకార వేతనాల నిధులు విడుదల చేయడంతో పాటు, సంక్షేమ హాస్టల్‌లలో పెరిగిన ధరలకు 3500రూ. ఛార్జీలు పెంచాలని, అద్దె భవనాల్లో ఉన్న గురుకులాలకు స్వంత భవనాలు నిర్మాణం చేయాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు సునీత, వినోద్, శేఖర్, మహేష్, రాకేష్, వినయ్, బంటి, అనిల్, అభిమన్యూ తదితరులున్నారు.

మరమ్మతులు కాదు నూతన రోడ్లు వేయాలి

బల్దియా చైర్‌పర్సన్‌కు హిందూ వాహిని నాయకుల వినతి

జగిత్యాలఅర్బన్, జూలై 12: రానున్న గణేష్ నవరాత్రి, దుర్గామాత ఉత్సవాలను దృష్టిలో ఉంచుకొని తాత్కాలికంగా రోడ్లను మరమ్మతులు చేయకుండా వాటి స్థానంలో నూతన రోడ్లు వేయాలని కోరుతూ జగిత్యాల బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతికి హిందూ వాహిని సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా హిందూ వాహిని నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే టవర్ నలుమూలల నుంచి వచ్చే రోడ్లన్నీ గుంతలు పడ్డాయని, వర్షాకాలం కావడంతో పాదాచారులకు, వాహనదారులకు ప్రయాణం ఇబ్బందికరంగా మారిందన్నారు. తాత్కాలిక మరమ్మత్తులు చేయకుండా, వాటి స్థానంలో కొత్త రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని ప్రాంత సంపర్గ ప్రముఖ్ వేముల సంతోష్, బాధ్యులు కైలాసపతి, విష్ణు, హరీష్, మహేష్, రాకేష్, ప్రతాప్, దశరథం తదితరులున్నారు.

స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎస్పీ



ఠాణాలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ

ధర్మపురి, జూలై 12: పోలీస్‌స్టేషన్ పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా చూడాలన్నారు. ధర్మపురి పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు చేసే విధులు అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చోరీలు జరగకుండా నిత్యం గస్తీ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీ వెంట సీఐ రాంనరసింహారెడ్డి, ఎస్సై ఉదయ్ కుమార్ ఉన్నారు.

ప్రజలు తిరస్కరించినా బుద్ధి మారదా

● కాంగ్రెస్ పిల్ల చేష్టలతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటు
● కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

మెట్‌పల్లి, జూలై, 12 : నియోజక వర్గంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు జువ్వాడి నర్సింగరావు, కృష్ణరావులను ఐదు సార్లు ప్రజలు తిరస్కంచినా బుద్ధి మారలేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ విమర్శించారు. శుక్రవారం మెట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గంలోని దేవాలయాలకు బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ సభ్యుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తీసుకోచ్చిన నిధుల ప్రోసిడింగ్‌లను కృష్ణారావు అందజేస్తూ తామే తెచ్చామని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. కల్వకంట్ల విద్యాసాగర్‌రావు టీటీడీ సభ్యుడుగా ఉన్న సమయంలో నియోజక వర్గంలోని ప్రజలకు తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనంతో పాటు శ్రీవారి ట్రస్టు ద్వారా దేవాలయాలకు వందల కోట్లు నిధులు తీసుకొచ్చారన్నారు. తెలంగాణలో 159 దేవాలయాల అభివృద్ధికి నిధులు మంజూరు అయిన వాటిలో జిల్లాలోని 85 దేవాలయాలకు అనుమతులు తీసుకరావడం, 2023ఆగష్టులో టీటీడీ అధికారులు జీయో ట్యాగింగ్ పూర్తి చేసి ఎంపిక చేయించామన్నారు. అదే నెలలో దేవాలయాల్లో నిర్మాణ పనులకు అప్పటి టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి అనుమతులు ఇచ్చి, నిధులను అక్టోబర్‌లో ఎండోమెంట్ కార్యాలయానికి పంపించారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిర్వహించడం నిలిచిపోయిందన్నారు. వాటికి సంబంధించిన నిధులు ప్రొసిండింగ్‌లను గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుడు కృష్ణారావు అందజేస్తూ తామె తెచ్చామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడు నెలలు పూర్తియైనప్పటి నుంచి ఎన్ని నిధులు తీసుకొచ్చారు. వాటి వివారలను ప్రజలకు తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, మాసీ సర్పంచు తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతిరెడ్డి, రాజాగౌడ్, రాంరెడ్డి, నారాయణరెడ్డి, చంద్రశేఖర్, కిషోర్, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

కమిటీల పేరుతో కాలయాపన తగదు

●బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి ●రాష్ట్రంలో పంటలకు ఫసల్ బీమా అమలుకు డిమాండ్



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కిసాన్‌మోర్చా బాధ్యులు

జగిత్యాలఅర్బన్, జూలై 12: రైతు భరోసా ఇవ్వకుండా కమిటీల పేరుతో తెలంగాణ ప్రభుత్వం కాలయాపన చేయడం తగదని బీజేపీ కిసాన్‌మోర్చ జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి అన్నారు. రైతాంగ సమస్యల పరిష్కారం కోరుతూ బీజేపీ కిసాన్‌మోర్చ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాంబాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తాత్సారం చేయడం సరికాదని, వెంటనే రెండులక్షల వరకు రుణ మాఫీని అమలుచేయాలని, అలాగే పంటలు పండే భూములకు తక్షణమే రైతు భరోసా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వానాకాలం ప్రారంభం అయిన రైతు భరోసా ఇవ్వకుండా కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. వెంటనే రైతులకు, రైతు కూలీలకు, కౌలు రైతులకు ఇస్తామన్న భరోసాను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రైతు నాయకులు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ తక్షణమే రైతులకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించాలని, ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించాలన్నారు. కిసాన్ మోర్చ బాధ్యులు కుర్మ మల్లారెడ్డి, అన్నాడి జలపతిరెడ్డి, గణేష్, నర్సింహారెడ్డి, మల్లయ్య, మోహన్‌రెడ్డి, శ్రీధర్, వినీత్, సతీష్ రైతులతో పాటు పట్టణ బీజేపీ అధ్యక్షుడు రంగు గోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం

రాయికల్, జూలై 12: మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు కూరగాయల సురేష్, ఆకు రమేష్, రవి నాయక్, సుగుణ కళ, విజయ, అంకారావులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, అమ్మ ఆదర్శ కమిటీ అధ్యక్షులు శ్యామల, ప్రధానోపాధ్యాయులు ముక్కల మోహన్ రెడ్డి, వేముల మధు, అంతడుపుల గంగరాజం, గిరిధర్, కార్తీక్, నర్సయ్య, గంగరాజం, ప్రసన్న లక్ష్మి పాల్గొన్నారు.

తపోవన్‌లో గోరింటాకు ఉత్సవం

జగిత్యాలఅర్బన్, జూలై 12: పట్టణంలోని బైపాస్ రోడ్‌లో గల తపోవన్ పాఠశాలలో శుక్రవారం ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. చేతులకు గోరింటాకు అందంగా అలంకరించుకున్న విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ అనుమల్ల శ్యామ్ బహుమతులు ప్రధానం చేశారు. ఆషాడమాసంలో గోరింటాకు పెట్టుకోవడం వల్ల కలిగే ఉపయోగాలను, గోరింటాకు విశిష్టతను ప్రిన్సిపాల్ శ్వేత విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోషకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్య పరిష్కారానికి సీఎం హామీ

జగిత్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్య పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారని టీ పెన్షనర్ల అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెన్షనర్ల సంఘం కార్యాలయంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. పెన్షనర్లకు ఉచిత సేవలను అందిస్తున్న పలువురు సంఘ నేతలను శాలువలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఇటీవల హైద్రాబాద్ తమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య కలిసి సమస్యలను విన్నవించారన్నారు. సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరి అశోక్ కుమార్

ప్రజల భాగస్వామ్యంతోనే వన మహోత్సవం విజయవంతం

ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల టౌన్, జూలై 12: ప్రజల భాగస్వామ్యంతోనే వన మహోత్సవం విజయవంతం అవుతుందని తద్వారా రాష్ట్రమంతా పచ్చదనంగా మారుతుందని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మిని స్టేడియంలో మున్సిపల్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచం లోనే మంచి సమతౌల్య వాతావరణం కలిగిన దేశం భారతదేశం అని వివరించారు. 33 శాతంగా ఉన్న అటవీ సంపద నేడు అంతరించిపోతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి చొరవతో రాష్ట్రంలో పచ్చదనం అభివృద్ధికి వన మహోత్సవ కార్యక్రమం చేపట్టామన్నారు. మొక్కలు నాటడం అనే ది ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించి కనీసం ఐదు మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని కోరారు. మున్సిపల్ చైర్ పర్సన్ జ్యోతి మాట్లాడుతూ పర్యావ రణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భా గస్వాములు కావాల న్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గోళి శ్రీనివాస్, కమిషనర్ సమ్మయ్య, కౌన్సిలర్లు నవీన్, గంగమల్లయ్య, రాజేష్, లత, గంగా సాగర్, వాకర్స్ సభ్యులు గౌతంరెడ్డి, టీవీ సూర్యం, వేముల దేవరాజం, నాగయ్య ఉన్నారు.

భీమారం: భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లావణ్య, మాజీ స్కూల్ చైర్మన్ లక్ష్మినర్సయ్య, మాజీ సర్పంచ్ అరుణ, రఘు, ఎంపీటీసీ అర్జున్, విద్యార్థుల తల్లిదం డ్రులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్ పర్సన్

ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వహించాలి

గణేశ్‌నగర్, జూలై 12: శాతవాహన యూనివర్సిటీ(ఎస్‌యూ)లో ఎల్ఎల్‌బీ అన్ని సెమిస్టర్ పరీక్షలు ఒకేసారి నిర్వాహించాలని శాతవాహన యూనివర్సిటీ రిజిస్టర్‌కు శుక్రవారం లా విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా సీహెచ్ రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడు తూ ఆల్ ఇండియా బార్ కౌన్సిల్ ఎగ్జామ్స్ ఎన్‌రోల్‌మెంట్ కావాలంటే అన్ని సెమిస్టర్లు పాసై ఉండాలన్నారు. విద్యార్థుల సంవత్సర సమ యం వృధా కాకుండా, ఈ విద్యాసంవత్సరంలోనే అన్ని సెమిస్టర్లకు ఒక అవకాశం ఇవ్వాలని రిజిస్టర్‌ను కోరామన్నారు. కార్యక్రమంలో కొట్టే రమేష్, గాండ్ల అజయ్ పటేల్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న లా విద్యార్థులు

సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలి

- పర్యావరణవేత్త, సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా



పంకజ్ మెహ్లాను సన్మానిస్తున్న ఎస్సారార్ ప్రిన్సిపాల్ రామకృష్ణ

గణేశ్‌నగర్, జూలై 12: క్రమక్రమంగా పచ్చని అడవులు అంతరించి పోవడం, బొగ్గు, పెట్రోల్, డీజిల్ తదితర ఇందనాల వల్ల వాతావరణ కాలుష్యం పెరిగిపోవడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని, సౌరశక్తిని ప్రత్యామ్నాయంగా వినియోగించాలని పర్యావరణవేత్త సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా అన్నారు. శుక్రవారం ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలకు చేరుకొని అధ్యాపకులకు, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణకు చేయవలసి న కృషిని వివరించారు. ప్రతిఒక్కరూ సౌరశక్తిని వినియోగించడం ప్రారంభిస్తే పర్యావరణాన్ని కాపాడుకోగలమని సైక్లిస్ట్ పంకజ్ మెహ్లా సైకిల్ ద్వారా కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నాలుగువేల కిలోమీటర్లు పర్యట న చేస్తూ అందరికీ అవగాహన కల్పిస్తున్నారు. పంజాబ్ హిసార్‌కు చెందిన పంజాబ్ ఇంజనీరింగ్ కళాశాల మూడో సంవత్సరం విద్యార్థి పంకజ్ మెహ్లా 55 రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాల్లో సౌరశక్తిని అందరూ వినియోగించేలా ప్రచారం చేస్తున్నారు. పంకజ్ మెహ్లాను కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె రామకృష్ణ, వైస్ ప్రిన్సిపల్ టి రాజయ్య, స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ ఎ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ అధికారులు, విద్యార్థులు అభినందించారు.

ఉత్తర తెలంగాణ నిధులను దుర్వినియోగం చేయవద్దు

సుభాష్‌నగర్, జూలై 12: ఉత్తర తెలంగాణ ప్రాంతంలోని నీళ్ళు, నిధులు, ఖనిజ సంపదను దుర్వినియోగం చేయవద్దని ప్రొఫెసర్ ఏకు తిరుపతి అన్నారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు పీపుల్స్ మూమెంట్ సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణకు చెందిన 40మంది ప్రసిద్ధ గాయకులకు ఉద్యమ గాన కోకిల పురస్కారంతో సన్మానించారు. అనంతరం ప్రొఫెసర్ ఏకు తిరుపతి మాట్లాడుతూ గోదావరి పరివాహక ప్రాంతాల్లో నీళ్లు, బొగ్గు, విద్యుత్తు, ఇసుక, క్వారీ వంటి అనేక సంపదలు విరివిగా ఉన్నాయన్నారు. వాటిని ఈ ప్రాంతానికే కేటాయించాలన్నారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్, మార్వాడి సుదర్శన్, ముక్కెర సంపత్‌కుమార్, అన్నబోయిన ప్రశాంత్ పాల్గొన్నారు.

ఇల్లందకుంట/జమ్మికుంట: మండలంలోని కనగర్తికి చెందిన రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారం అందుకున్నారు. ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూ మెంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేకల చంద్రశేఖర్‌యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర సంపత్ శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్ భవన్‌లో ఉత్తర తెలంగాణ పీపుల్స్ మూమెంట్ ఉద్యమసంస్థ ఆవిర్భావం సందర్భంగా రామంచ భరత్‌కు ఉద్యమ గానకోకిల పురస్కారాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


పొలాడి సాయికుమార్ (ఫైల్)

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ కోతిరాంపూర్‌లో శుక్రవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో బొమ్మకల్ గ్రామం కృష్ణనగర్ కాలనీకి చెందిన పొలాడి సాయికుమార్ (26) మృతి చెందాడు. అతడి స్నేహితుడు కత్తెర్ల అరవింద్‌కు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సాయికుమార్, అరవింద్ బైక్‌పై అల్గునూర్ నుంచి కరీంనగర్‌కు వస్తుండగా కోతిరాంపూర్ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేసిన వ్యాన్‌ను ఢీకొన్నారు. దీంతో సాయికుమార్ అక్కడిక క్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన అరవింద్‌ను 108 సిబ్బంది అన్వేష్, మనోహర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వ్యాన్ పార్కింగ్ లైట్లు వేసుకోకుండా నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా రోడ్డు పక్కన పార్క్ చేయటంతో చీకట్లో వ్యాన్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టిందని మృతుడి తండ్రి మహేందర్ పోలీసులకు ఫిర్యాదు చేశా డు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వేములవాడ రూరల్, జూలై 12: మండలంలోని నూకలమర్రికి చెందిన ఓ యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకా రం.. నూకలమర్రి గ్రామానికి చెందిన పాలకుర్తి ప్రశాంత్(20) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమించాడు. తన ప్రేమ విఫలమవుతుందేమోనని భయంతో వారం రోజుల క్రితం గడ్డి మందుతాగాడు. కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. ప్రశాంత్ కుటుంబసభ్యులు ఆ యువతి ఇంటి ఎదుట మృతదేహంతో ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ప్రశాంత్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సిరిసిల్ల క్రైం, జూలై 12: తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేని నవీన్ అనే వ్యక్తికి ఓ హత్య కేసులో జీవిత ఖైదు, రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్ ప్రేమలత శుక్రవారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.. తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటకు చెందిన ఇలవేణి స్వప్నకు ఆమె మరది అయిన నవీన్ మధ్య తరుచు గొడవలు జరిగేవి. ఈ క్రమంలో 2020 సెప్టెంబరు 7న ఇద్దరి మధ్య గొడవ జరిగింది. స్వప్న తండ్రి గీస రాములు వీరిని అడ్డుకునే ప్రయత్నం చేశాడు. కోపోద్రిక్తుడైన నవీన్ పారతో రాములు తలపై కొట్టాడు. తీవ్రంగా గాయపడిన రాములును ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు తంగళ్లపల్లి పోలీసులు కేసు నమోదుచేసి నవీన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ సర్వర్ కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. పీపీ నర్సింగరావు కేసు వాదించారు. కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీందర్‌నాయుడు ఆధ్వర్యంలో కానిస్టేబుల్ నరెందర్ కోర్టులో 13 మంది సాక్షులను ప్రవేశపెట్టారు. నేరం రుజువు కావడంతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత నవీన్‌కు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

● జగిత్యాలలో మరొకరికి..

జగిత్యాల టౌన్: డబ్బుల విషయం, భూమి తగాదాల్లో కట్టుకున్న భార్యను కత్తితో పొడిచి హత్య చేసి, అడ్డువచ్చిన కూతురిని గాయపరిచిన కేసులో తండ్రికి జీవిత ఖైదు జైలు శిక్షతోపాటు 6,500 రూపాయల జరిమానా విధిస్తూ జగిత్యాల కోర్టు అడిషనల్ సెషన్స్ జడ్జి నారాయణ శుక్రవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల జిల్లాలోని పెగడపల్లి మండలం దోమలకుంటకు చెందిన నక్క గంగవ్వకు అదే గ్రామానికి చెందిన నక్క రమేష్‌తో వివాహం జరిగింది. వీరికి కూతురు, కుమారుడు ఉన్నారు. రమేష్ ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లినప్పటికీ భార్య, పిల్లల పోషణకు డబ్బులు పంపలేదు. స్వదేశానికి వచ్చిన రమేష్‌ను డబ్బుల విషయంపై భార్య గంగవ్వ, కుమారుడు జలందర్ నిలదీశారు. దీంతో రమేష్ తన డబ్బులను తన సోదరి పద్మకు పంపించానని, తాను సంపాధించిన డబ్బులు అడిగే హక్కు మీకు లేదని చెప్పాడు. అనంతరం రమేష్ తన సోదరి ఇంటికి వెళ్లి అక్కడే ఉండేవాడు. 2020 నవంబరు 13న పాత పగలు మనసులో పెట్టుకుని కుమారుడు జలందర్‌ను కత్తితో పొడిచి హత్య చేశాసిన రమేష్ జైలు శిక్ష అనుభవించాడు. జైలు నుంచి తిరిగి బెయిల్‌పై వచ్చిన రమేష్ నడవడికలో మార్పు రాలేదు. పాత పగలు మనుసులో పెట్టుకుని 2022 డిసెంబర్ 18న తన భార్య గంగవ్వను కత్తితో పొడవడంతో పాటు అడ్డుగా వచ్చిన కూతురు స్నేహపై కూడా దాడికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలైన గంగగ్వ మృతి చెందగా స్వల్ప గాయాలతో బయటపడ్డ కూతురు స్నేహ అదే రోజు పెగడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ రాంమూర్తి కేసు నమోదు చేయగా కోర్టు డ్యూటీ అధికారులు కిరణ్‌కుమార్, సాగర్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. అదనపు పీపీ మల్లికార్జున్ కేసు వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడు రమేష్‌కు జీవిత ఖైదు విధించారు.

కరీంనగర్ కోర్టుకు
మావోయిస్టు పొలిట్ బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి

కరీంనగర్ క్రైం, జూలై 12 : మావోయిస్టు పొలిట్‌బ్యూరో సభ్యుడు అమిత్‌బాగ్చి అలియాస్ అమిత్‌ను కరీంనగర్ రూరల్ పోలీసులు శుక్రవారం కరీంనగర్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు ఆదేశాలతో చర్లపల్లి జైలుకు తరలించారు. అమిత్‌బాగ్చితోపాటు మరికొందరు ప్రభుత్వంపై కుట్రచేశారని 2008లో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసులో 2018లో ఒకసారి అమిత్‌బాగ్చిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. అమిత్‌బాగ్చి అప్పటి నుంచి కోర్టు వాయిదాలకు హాజరుకాలేదు. దీంతో కోర్టు వారెంట్ జారీ చేసింది. జార్ఖండ్ రాష్ట్రం రాంచి జైలులో ఉన్న అమిత్‌బాగ్చిని కరీంనగర్ రూరల్ పోలీసులు పీటీ వారెంట్‌పై కరీంనగర్‌కు తీసుకువచ్చి ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరచి, చర్లపల్లి జైలుకు తరలించారు.

భూమి అమ్మిన డబ్బులు ఇవ్వడం లేదని ఆత్మహత్యాయత్నం


చికిత్స పొందుతున్న దేవరాజు

చందుర్తి జూలై 12: చందుర్తి మండలం మర్రిగడ్డలో భూమి అమ్మిన డబ్బులు తనకు ఇవ్వలేదని ఓ వ్యక్తి శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం.. రామన్నపేటకు చెందిన దుమ్మ దేవరాజు ఇదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన భూమిని రెండు సంవత్సరాల క్రితం విక్రయించాడు. కొన్ని డబ్బులు చెల్లించిన కొనుగోలుదారుడు మిగిలిన డబ్బులను ఇవ్వడం లేదు. రెండేళ్లుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని మనోవేదనకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై చందుర్తి ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ బాధితుడు 100 నంబర్‌కు డయల్ చేసి తనను హత్య చేయడానికి ప్రయత్ని స్తున్నారని చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లారని చెప్పారు. పురుగుల మందు డబ్బాతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు వెంటనే 108లో వేముల వాడ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

సస్పెండ్ చేశారని ఆర్టీసీ డ్రైవర్..


చికిత్స పొందుతున్న సీహెచ్ఎం రెడ్డి

భగత్‌నగర్, జూలై 12: కరీంనగర్-1 డిపోకు చెందిన సీహెచ్ఎం రెడ్డి అనే ఆర్టీసీ డ్రైవర్ శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. నాలుగు రోజుల క్రితం ఆల్కహాల్ పరీక్షలో 21 శాతం నమోదు కావడంతో అధికారులు అతడిని సస్పెండ్ చేశారు. శుక్రవారం ఉదయం డిపోకు వచ్చిన సీహెచ్ఎం రెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే అతనిని కరీంనగర్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న సీహెచ్ఎం రెడ్డిని ఆర్టీసీ జోనల్ ఈడీ వినోద్‌కుమార్, ఆర్టీసీ అధికారులు పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య

మల్యాల, జూలై 12: మండలంలోని నూకపల్లికి చెందిన ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఓలపు స్వప్న (35) అనే మహిళ భర్త నర్సయ్య ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. కూతురు, అత్తమామలతో కలిసి నూకపల్లిలో ఉంటున్న స్వప్న భర్త కోసం మానసిక వేదనకు గురవుతూ ఎడబాటు భరించలేక శుక్రవారం ఇంట్లోనే ఉరి వేసుకుంది. స్వప్నకు ఏడేళ్ల కూతురు ఉంది. స్వప్న తండ్రి పర్శరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కరీంనగర్‌లో ముంబై పోలీసులు

● రెండు రోజులపాటు పలు కాలనీల్లో విస్తృత తనిఖీలు ● పలువురి విచారణ.. ఒకరి అరెస్టు ● ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తరలింపు



కరీంనగర్ క్రైం, జూలై 12: సైబర్ నేరగాళ్ల కోసం ముంబై ఈస్ట్ రీజియన్ సైబర్ వింగ్ పోలీసులు గురువారం, శుక్రవారం రెండు రోజులు కరీంనగర్‌లోనే మకాం వేశారు. అంతర్జాతీయ సైబర్ నేరగాళ్లతో చేతులు కలిపి కొందరు కరీంనగర్‌లో ఒక డొల్ల కంపెనీ పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచి డబ్బులు బదిలీ చేశారని వారి విచారణలో తేలింది. కరీంనగర్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వారిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు కరీంనగర్‌లోని ఆదర్శ నగర్, హుస్సేనిపుర, సుభాష్‌నగర్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీసుల సహాయంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అనుమానితులు నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. విచారణ నిర్వ హించి కొందరిని వదిలిపెట్టారు. మరో ఇద్దరు నిందితులు పరారయినట్లు తెలిసింది. శుక్రవారం కరీంనగర్‌కు చెందిన అహ్మద్‌ఖాన్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ముంబాయి సైబర్ క్రైం పోలీసులు అతడిని కరీంనగర్ కోర్టులో హాజరుపరచి ట్రాన్సిట్ వారెంట్‌పై ముంబైకి తీసుకువెళ్లారు. అక్కడి కోర్టులో హాజరుపరచనున్నారు. మార్చి నెలలో ముంబైలో ఓ బాధితుడి ఫిర్యాదుతో నమోదైన సైబర్ క్రైం కేసులో కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ బ్యాంక్‌లో మందాని ఇంపాడ్ ఫూర్ వెల్ఫేర్ ట్రస్ట్ సంస్థ పేరిట సెక్రెటరీ, ట్రెజరర్, సభ్యులు మొత్తం ఏడుగురి పేరిట జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరిచారు. ఈ ఖాతాలోకి సైబర్ క్రైంకు సంబంధించిన భారీ మొత్తంలో డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ముంబై సైబర్ పోలీసులు గుర్తించారు. నిందితులను విచారించేందుకు కరీంనగర్‌కు వచ్చారు. ప్రైవేట్ బ్యాంక్‌లో డొల్ల కంపెనీ పేరిట ఉన్న ఖాతాలో లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని, రికార్డులతోపాటు నిందితుడి వద్ద లభించిన కొన్ని కీలక పత్రాలను ముంబై పోలీసులు స్వాధీనం చేసుకుని వెంట తీసుకు వెళ్లినట్లు సమాచారం. సైబర్ నేరస్థులతో కరీంనగర్ వ్యక్తులకు ఏమిటి సంబంధం? వారికి పరిచయం ఏమిటి? అనేది తెలియడంలేదు. కరీంనగర్‌కు చెందిన కొందరికి ఉద్యోగం లేదా కమిషన్ పేరిట ఆశ చూపించి వారిచేత ఒక జాయింట్ అకౌంట్ తెరచి, సైబర్ నేరగాళ్ల ఫ్రాడ్ చేసిన డబ్బులను ఆ ఖతాలోకి మళ్లించిన అనంతరం డ్రా చేసుకున్నట్లు తెలిసింది. సైబర్ క్రైంతో సంబంధం ఉన్నది కాబట్టే ఒకరిని అరెస్టు చేశారని నిర్ధారణ అయింది. ఈ కేసుకు సంబంధించి ముంబై సైబర్ పోలీసులు వివరాలు చెప్పలేదని, స్థానికంగా విచారణకు సహకరించాలని కోరారని స్థానిక పోలీసు అధికారులు చెబుతున్నారు.

గ్రామ పంచాయతీల్లో పంచాయతీరాజ్ డీసీ పర్యటన



తిమ్మాపూర్‌లో సెగ్రిగేషన్ షెడ్‌ని పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ

తిమ్మాపూర్, జూలై 12: తిమ్మాపూర్ గ్రామాన్ని పంచాయతీరాజ్ డిప్యూటీ కమిషనర్ జాన్ వెస్లీ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశు ధ్యం, ప్లాంటేషన్, నర్సరీ, వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామ పంచాయతీ పనితీరు బాగుందని అభినందించారు. వివిధ జిల్లాల పంచాయితీల కార్యదర్శులకు తిమ్మాపూర్‌లో శిక్షణ ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీపీవో రవీందర్, డివిజనల్ పంచాయతీ అధికారి రాంబాబు, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంపీవో కిరణ్ కుమార్, పంచాయితీ కార్యదర్శి కె మహేందర్ రావు, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

● జమ్మికుంట రూరల్: మండలంలోని గండ్రపల్లి గ్రామపంచాయతీని పంచాయతీ రాజ్ డిప్యూటీ కమీషనర్ జాన్ వేస్లీ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని నర్సరీ, వైకుంఠదామం, పల్లె ప్రగతి, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ డీఎల్పీవోలు శ్రీనివాస్, రాంబాబు, ఎంపీడీవో భీమేష్, ఎంపీవో సతీష్ కుమార్, ఏపివో లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

సైదాపూర్, జూలై 12: మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్ట రవీందర్, ఉపాధ్యక్షుడు పెసరు కుమార స్వామి మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక అలా, మత్స్య పారిశ్రామిక సంఘం రాష్ట్ర చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను కోరారు. వారు హైదరాబాద్‌లో అధికారులను శుక్రవారం కలిశారు. కరీంనగర్ జిల్లాలోని 26 సంఘాల పరిధిలో సభ్యత్వ నమోదుకు స్కిల్ టెస్ట్ పూర్తి చేసుకుని ప్రొజిలింగ్ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. వారికి త్వరగా ప్రొజిలింగ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై శిక్షణ తరగతుల ముగింపు

కరీంనగర్ టౌన్, జూలై 12: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు సైన్స్ పరికరాలు, సోలార్ స్మార్ట్ క్లాస్‌లపై నగరంలోని ఫిల్మ్‌భవన్‌లో శిక్షణ తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు మాట్లాడుతూ యునిసెఫ్ సంస్థ సమగ్రశిక్ష తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో హిందూస్తాన్ పెట్రోలియం సహకారంతో కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని 125 పాఠశాలలకు అందించిన సైన్స్ పరికరాలతో శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమాల్లో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో విద్యార్థులకు ప్రయోగాత్మకంగా బోధించాలన్నారు. కరీంనగర్, సిద్దిపేట, హన్మకొండ జిల్లాలకు చెరందిన 23 పాఠశాలల సైన్స్ ఉపాధ్యా యులకు సోలార్ ప్రొజెక్టర్ నిర్వహణ, సైన్స్ పరికరాల వినియోగంపై శిక్షణ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 15న సోమవారం కరీంనగర్‌లోని ధన్గరివాడీ పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌పై కరీంనగర్, రాజన్న సిరిసిల్ల జిల్లాల ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, అందరూ హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో యూనిసెఫ్ సంస్థ మానిటరింగ్ డైరెక్టర్ కె గిరిజాశంకర్, రిసోర్స్ పర్సన్ రాజు, ప్రాజెక్టు ఇంజనీర్ వికాస్, ఢిల్లీ సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అభిషేక్ దీక్షిత్ కాన్పుర్ జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అబ్దుల్ బారీ, కె అశోక్‌రెడ్డి, ఏఎంవో అంజనేయులు, సీఎంవో ఎ శ్రీనివాస్, బాస్కర్, తొర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సల్లంగ చూడు పోచమ్మ తల్లి


నెత్తిన బోనంతో ఊరేగింపులో పాల్గొన్న చైర్ పర్సన్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల టౌన్, జూలై 12: ఊరు వాడా సల్లంగ చూడు పోచమ్మ తల్లి అంటూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తులసీనగర్, అన్నపూర్ణ చౌరస్తాలో ఉన్న గంగపుత్ర సంఘం వార్డుల్లోని భక్తుల ఆధ్వర్యంలో శుక్రవారం పోచమ్మ తల్లికి బోనాల పండుగ కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఇంటికో బోనం నెత్తిన ఎత్తుకుని ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి కార్యక్రమంలో పాల్గొని నెత్తిన బోనం ఎత్తుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం డీజే పాటలు, కోలాటాల మధ్య పోచమ్మ తల్లి ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సిరికొండ పద్మ సింగారావు, తొపారపు లావణ్య రజనీకాంత్ పాల్గొన్నారు.

హుజూరాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

హుజూరాబాద్, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగాధిపతిగా పని చేస్తున్న లక్ష్మీనర్సింహమూర్తి శుక్రవారం డాక్టరేట్ అందుకున్నారు. లక్ష్మీనర్సింహామూర్తి చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో 'కస్టమర్ పర్‌సెప్షన్ టు వర్డ్స్ డిజిటల్ బ్యాంకింగ్ ఏ సెలక్ట్ స్టడీ' అనే అంశంపై పరిశోధన చేయగా, డాక్టరేట్ పొందారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం లక్ష్మీనర్సింహామూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, అధ్యాపకులు దినకర్, శ్రీనివాస్, మధు, పరమేష్, శ్యామలదేవి, హరిప్రసాద్, సమ్మయ్య, స్వరూప, స్వప్న, రాజ్‌కుమార్, రమేష్, శ్రీలత, స్పందన, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పోస్ట్‌మార్టం గది



జమ్మికుంట ఆసుపత్రిలో శిథిలావస్థకు చేరుకున్న పోస్టుమార్టం గది, కొత్తగా కేటాయించిన స్టోర్ రూం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు

జమ్మికుంట, జూలై 12: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం గది పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. 1988లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దగ్గుపాటి వెంకటేశ్వర్‌రావు ప్రభుత్వ ఆస్పత్రిని ప్రారంభించారు. పాత భవనం నిర్మించి 35సంవత్సరాలు గడవడంతో పూర్తిగా శిథిలవస్థకు చేరుకుంది. 2018లో ఆసుపత్రికి కొత్త భవనం నిర్మించి ప్రారంభించారు. భవణం కోసం కోట్లాది రూపాయాలు వెచ్చించిన ప్రభుత్వం పోస్ట్‌మార్టం గది కోసం పది లక్షలు మంజూరు చేయలేక పోవడంపై పలువురు అప్పటి మంత్రి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లారు. నూతన ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయి ఏడేళ్లు గడుస్తున్నా పోస్టుమార్టం నూతన గది నిర్మాణం కోసం నిధులు మంజూరు కాక పోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● స్టోర్‌రూం కేటాయించినా..

ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పోస్ట్‌మార్టం గది శిథిలావస్థకు చేరుకోవడంతో పాడుబడిన స్టోర్‌రూమ్‌ను తాత్కాలికంగా కేటాయించారు. స్టోర్‌రూమ్ కొత్తగా కనపడేందుకు ముందు బాగంలో మాత్రమే పెయింటింగ్ వేయించారు. చుట్టూ, వెనుక భాగం చెట్లు, గడ్డి మొక్కలతో నిండిపోయింది.

నాటు సారా పట్టివేత

గన్నేరువరం, జూలై 12: ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు మండలంలోని గుండ్లపల్లి, గునుకుల కొండాపూర్, జంగపల్లి గ్రామాల్లో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఏడు లీటర్ల నాటు సారాను పట్టుకుని స్వాధీనం చేసుకు న్నారు. మోత్కులపల్లిలో నాటు సారాను తయారుచేసిన సం పంగి కొమురయ్య, ఇరుగదిండ్ల పాపయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎస్ బాబా తెలిపారు. నాటుసారా తయారు చేసినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీకాంత్, సిబ్బంది నరేష్, కొండల్‌రెడ్డి, మనోహర్, రజిత, వంశీ పాల్గొన్నారు.

బైండోవర్ అతిక్రమణకు రూ.30 వేల జరిమానా

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట మండలం వావిలాలకు చెందిన దుస్స కొమురయ్య అనే వ్యక్తి గతంలో నాటు సారా విక్రయాలు జరుపగా ఎక్సైజ్ పోలీస్‌లు అదుపులోకి తీసుకోని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. బైండోవర్ తర్వాత నిబంధనలను అతిక్రమించి తిరిగి నాటుసారా అమ్మడంతో అతడిని అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ ఎస్ఐ సౌమ్య తహసీల్దార్ విజయ ఎదుట హాజరు పరిచారు. బైండోవర్ అతిక్రమించిన కొమురయ్యకు తహసీల్దార్ 30 వేల రూపాయల జరిమానా విధించారు.

అంజన్న హుండీ ఆదాయం రూ.65.39 లక్షలు



కొండగట్టు, ఇల్లందకుంట ఆలయాల ఆవరణలో హుండీ లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

మల్యాల, జూలై 12: కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా 65,39,167 రూపాయల ఆదాయం సమకూరినట్లు ఈవో ఎ చంద్రశేఖర్ తెలిపారు. 35 రోజులకు గాను ఆలయంలోని 12 అంజన్న హుండీలను విప్పి శుక్రవారం లెక్కించారు. నగదుతోపాటు 30 గ్రాముల మిశ్రమ బంగారం, 1.85 కిలోల మిశ్రమ వెండి, 38 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో వరంగల్ ఏసీ కార్యలయం పరిశీలకులు కవిత, ఏఈవో అంజయ్య, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, చంద్రశేఖర్ శ్రీ లలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.

● ఇల్లందకుంట ఆలయ ఆదాయం రూ. 7.23 లక్షలు

ఇల్లందకుంట: ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శుక్రవారం హుండీలను ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్ ఆధ్వర్యంలో లెక్కించారు.

ఈ మేరకు 70 రోజుల్లో సమకూరిన హుండీల ద్వారా 7,23,433 రూపాయలు సమకూరింది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు కావటి మోహన్, రాజయ్య, మల్లారెడ్డి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీకి తగ్గిన ఇన్‌ఫ్లో

జగిత్యాల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో తగ్గింది. శుక్రవారం ఎస్సారెస్పీలోకి 479 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 90.323 టీఎంసీలు కాగా ప్రస్తుతం 12.44 టీఎంసీల నీరు ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 17.453 టీఎంసీల నీరు ఉంది. ప్రా జెక్టు నుంచి 479 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటివరకు ప్రాజెక్టులోకి 6.615 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది.

చికెన్ సెంటర్‌లో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, జూలై 12: కరీంనగర్ మారుతీనగర్ చౌరస్తాలో భారత్ చికెన్ సెంటర్‌లో శుక్రవారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు అంటుకుని షాపులోని టీవీ, సీసీ కెమెరాలు, విద్యుత్ మీటర్, కౌంటర్, వేయింగ్‌మిషన్ కాలిపోయాయయని చికెన్ సెంటర్ యజమాని ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. దాదాపు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందన్నాడు. సంఘటనా స్థలాన్ని ఎంఐఎం నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ సందర్శించారు. బాధితుడికి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని అందించి ఆదుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మెట్‌పల్లి రూరల్, జూలై 12: మండలంలోని వేంపేట శివారులోని వ్యవసాయ క్షేత్రంలో పేకాట స్థావరంపై ఎస్ఐ చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేశారు. శుక్రవారం గ్రామ శివారులో ఎనిమిది మంది పేకాట ఆడుతున్నరనే సమాచారం మేరకు మఫ్టీలో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 14,200 రూపాయలు స్వాధీనం చేసుకున్నామన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

మల్యాల, జూలై 12: మండలంలోని రామన్నపేటలో ఉమ్మడి రవి అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగింది. రవి కుటుంబసభ్యులు తమ ఇంటికి తాళం వేసి సమీపంలోని సంఘ భవనంలో ఉంటున్నారు. శుక్రవారం తెల్లవారు జామున తాళం వేసి ఉన్న ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో బీరువా తెరిచి వెండి నగలు, ఇతర వస్తువులను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నరేష్, పోలీసులు సంఘటన స్థలం పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

● మెట్‌పల్లి: పట్టణంలో మనోహర్ గార్డెన్ సమీపంలోని తాళం వేసిన ఓ ఇంట్లో శుక్రవారం చోరీ జరిగింది. పట్టణానికి చెందిన లక్కం పద్మ ఉదయం ఇంటికి తాళం వేసి బంధువులను కలవడానికి మరోగ్రామానికి వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి లోపలికి వెళ్లి చూసేసరికి ఇంట్లో దాచిన ఆరు తులాల బంగారు అభరణాలు, ఐదు వేల నగదు చోరీ జరిగినట్లు గుర్తించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

కుమారుడి మృతిపై అనుమానాలున్నాయని డీజీపీకి ఫిర్యాదు

చొప్పదండి, జూలై 12: తమ కుమారుడు మంద విను మృతిపై అనుమానాలు ఉన్నాయని చొప్పదండికి చెందిన మంద మహేందర్, నీరజ డీజీపీ ఫిర్యాదు చేశారు జనవరి 21న ములుగు జిల్లా మేడారం గ్రామానికి మంద విను మరో ముగ్గురితో కలసి వెళ్లాడు. 22న విను మృతిచెందాడని తమ కు సమాచారాన్ని అందిందన్నారు. విను మృతిపై అనుమా నాలు ఉన్నాయని తాడ్వాయి పోలీసులకు చెప్పినా పట్టించు కోలేదని, తమకు న్యాయం చేయాలని డీజీపీని కోరారు.

ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని యువకుడి మృతి

పెద్దపల్లి రూరల్, జూలై 12: మండలంలోని రాఘవపూర్ గ్రామానికి చెందిన రమేష్ (29) ద్విచక్ర వాహనంపై వెళుతూ ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ శుక్రవారం కిరాణ దుకాణానికి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపై నిలిచి ఉన్న వాహనాన్ని ఢీకొంది. రమేష్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి తెలిపారు.

వరినాటు యంత్రం బోల్తా: డ్రైవర్‌కు గాయాలు

శంకరపట్నం, జూలై 12: మండలంలోని కన్నాపూర్ శివారులో శుక్రవారం వరినాటు యంత్రం బోల్తా పడి డ్రైవర్ కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కన్నాపూర్ శివారులో చెరువు కట్టపై నుంచి వరినాటు యంత్రం వెళుతుండగా అదుపుతప్పి కట్ట కింద బోల్తా పడింది. మిషన్ కింద డ్రైవర్ పడి కేకలు వేయడంతో సమీపంలోని ప్రజలు అక్కడికి చేరుకొని వరినాటు మిషన్ పైకి లేపి డ్రైవర్‌ను బయటకు తీశారు. గాయాలైన డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ తమిళనాడుకు చెందిన వ్యక్తి కావడంతో అతడి వివరాలు తెలియరాలేదు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

జమ్మికుంట రూరల్, జూలై 12: వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి సమీపంలోని మానేరు నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామంలో శుక్రవారం పోలీస్‌లు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తర టలిస్తున్న ప్రశాంత్, శ్రీకాంత్, పరుశురామ్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

రూ. 7,550 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జూలై 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7550 రూపాయలు పలికింది. శుక్రవారం మార్కెట్ యార్డుకు 193 క్వింటాళ్ల విడి పత్తి వచ్చింది. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర 7,550, కనిష్ఠ ధర 7,200 రూపాయలు చెల్లించి పత్తి కొన్నారు.

అనాథ చిన్నారులకు ఆర్థిక సహాయం

కొడిమ్యాల, జూలై 12 : తల్లిదండ్రులు మృతి చెందడంతో అనాథలుగా మారిన మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన చిన్నారులు మణిదీప్, దివ్యశ్రీలకు పై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు 35 వేల రూపాయల చెక్‌ను కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ 5 వేల రూపాయలను సమకూర్చగా శుక్రవారం టీఆర్ఎస్ పార్టీ నాయకులు చిన్నారులకు అందించారు. ఈ కార్యక్రమంలో మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, మల్యాల మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకటి, స్వామి, రాజేశం, శ్రీనివాస్, రాజిరెడ్డి, దేవదాస్, కిషన్, పర్శ రాం, వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వహకులు మధు, మహేష్, బెజ్జెంకి రవీందర్, గొంగల్ల రవి, రాజేందర్, ప్రసాద్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన అడిషనల్ ఎస్పీ

మల్లాపూర్, జూలై, 12 : మల్లాపూర్ పోలీసు స్టేషన్‌ను జిల్లా అడిషనల్ ఎస్పీ బీమరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్పీ అశోక్ ఆదేశాల మేరకు శుక్రవారం పోలీసు స్టేషన్ సందర్శించి క్వాటర్స్, పరిసరాలు, రికార్డులు పరిశీలించి కేసుల విచారణ చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే వారికి ఇబ్బందులు కలుగ కుండా తగు న్యాయం చేయాలని, తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలు తెలిపారు. అడిషనల్ ఎస్పీ స్టేషన్‌కు వచ్చిన సమయంలో ఎస్సై, పూర్తి స్థాయిలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో వారిని హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మల్యాల, జూలై 12: మండలంలోని మల్యాల, తక్కళ్లపల్లి, మద్దుట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈఈలు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు జరుగనున్నందున మల్యాల, ముత్యం పేట, రాజారం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల, మద్దుట్ల, గొర్రెగుండం, గొల్లపల్లి, రామన్నపేట, నూకపల్లి గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

కొడిమ్యాల : కొడిమ్యాల విద్యుత్ సబ్ స్టేషన్ పరిదిలో శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రఘునాథ్ తెలిపారు. కొడిమ్యాల విద్యుత్ సబ్ స్టేషన్ మెన్టెనెన్స్ దృష్ట్యా సబ్ స్టేషన్ పరిదిలోని రామకిష్టాపూర్, కొండాపూర్, చింతల్లపల్లి గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తుల దృష్ట్యా ఆయా సబ్‌స్టేషన్ పరిధిలోని పొలాస, గుల్లపేట, పొలాస అగ్రికల్చర్‌కళాశాల, అనంతారం గ్రామాల్లో మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తామని ఏఇ సుందర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ప్రకటలో తెలిపారు.

రాయికల్: రాయికల్ పట్టణంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ హరీష్ తెలిపారు. కావున సబ్‌స్టేషన్ పరిధిలోని రాయికల్, ఖైతాపూర్, కుమ్మరిపెల్లి గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కథలాపూర్, జూలై 12 : ప్రస్తుతం సీజనల్ వ్యాదులు వ్యాపించే ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎంపీవో ప్రవీణ్ సూచించారు. శుక్రవారం మండలంలోని ఊట్‌పల్లిలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మురికి కాలువల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లాలని అన్నారు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా గ్రామస్థులకు చైతన్యం కలిగించాలని కోరారు. వ్యక్తిగత శుభ్రత పాటించేలా చూడాలని అన్నారు. చెత్తను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డులకు తరలించాలని సూచించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను పరామర్శించిన రాజేందర్

ధర్మపురి, జూలై 12: ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ మోకాలు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటికి రాగా బీసీ సాధికారత సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాదినేని రాజేందర్ శుక్రవారం ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట శ్రీ అక్కపెల్లి రాజ రాజేశ్వర స్వామి అలయ కమిటీ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, కమలాపూర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు కుమ్మరి లక్ష్మణ్, ఎర్ర నరేష్, డాక్టర్ సిరికొండ అశోక్, ఉయ్యాల రాజు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఆర్థిక సహాయం

మల్యాల, జూలై 12: మల్యాలకు చెందిన మ్యాదరి టీనా అనే చిన్నారి కిడ్నీ, ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతుండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం మన నేస్తం హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. ఈ మేరకు బాదిత కుటుంబసభ్యులకు రూ.20వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మీ జవాన్ కీసరి గణేష్, లవకుమార్, బొజ్జ నర్సయ్య, గుడిసె అలంకార్, చైతన్య, మహేష్, కొల్లూరి సతీష్, కీసరి సాయిచంద్, చిట్యాం సతీష్(ఆర్మీ), అనిల్, బాలు, రవీందర్, కుమార్, సుమన్, అరుణ్ పాల్గొన్నారు

ప్రతీ వ్యక్తి మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలి

ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు



నర్సింగాపూర్ లో మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ సీఐ

జగిత్యాలరూరల్, జూలై 12 : ప్రతి వ్యక్తి మొక్కలు నాటడం భాధ్యతగా తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ సర్వేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 75వ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్, నర్సింగాపూర్ గ్రామాల్లో శుక్రవారం గౌడ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఈత మొక్కలు నాటే కార్యక్రమానికి సీఐ ముఖ్య అతిథి గా హాజరై మొక్కలు నాటారు. నర్సింగాపూర్ గౌడసంఘం అధ్యక్షుడు పులి మల్లేశం గౌడ్, ధరూర్ గౌడసంఘం అధ్యక్షుడు సుద్దాల రాజుగౌడ్, సభ్యులు నాంపల్లిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్యగౌడ్, సునీల్‌గౌడ్, సాయిగౌడ్, ఎక్సైజ్ కానిస్టేబుళ్ల కిరణ్, సంతోష్, చల్‌గల్ పాల్గొన్నారు.

కోరుట్ల పట్టణ ఎంఐఎం పార్టీ కమిటీ రద్దు

కోరుట్ల, జూలై 12 : పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు కోరుట్ల ఎంఐఎం పార్టీ కమిటీని రద్దు చేస్తున్నట్లు, పార్టీ క్రమశిక్షణను ఉల్లగిస్తే ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదని ఎంఐఎం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సెన్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కింగ్ గార్డెన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో స్థానిక ఎంఐఎం నాయకులతో కలిసి మాట్లాడారు. ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండి సాబీర్ పాషా, ప్రదాన కార్యధర్శి అన్వర్ సిద్దిఖీలను ఎంఐఎం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ వారి ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించారు. కోరుట్ల పట్టణం ఎంఐఎం కార్యాకర్తల అభిప్రాయ సేకరణ చెపట్టి అట్టి విషయంను పార్టీ పెద్దలకు తెలుపగా వారి ఇచ్చిన సమాచారం మేరకు పార్టీ సభత్వంతో పాటు వారి పదవుల నుంచి తొలగిస్తున్నట్లు తెలిపారు. పార్టీ పదవులను అడ్డుపె ట్టుకోని దిగజారుడు రాజకీయాలకు పాల్పిడితే ఇస్టారాజ్యంగా వ్యవహిస్తే ఉరు కునేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ముజా ఫర్, అహ్మద్ సజ్జు, భూమయ్య, ముల్లా మసూద్, అమీరోద్దిన్, యూనూస్ పాషా, రఫీ, జహంగీర్ అహ్మద్ పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల విధ్యార్థులకు అవగాహన

జగిత్యాలరూరల్, జూలై 12 :జగిత్యాల రూరల్ మండలంలోని శ్రీచైతన్య హై స్కూల్ విద్యార్థులకు శుక్రవారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా విద్యార్థులకు ఫైర్ ఆఫీసర్ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఫైర్ ఇంజన్ వల్ల కలిగే ఉపయోగాలు, సిలిండర్ పేలినపుడు దానిని ఎలా ఆర్పాలి అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్ర మంలో పాఠశాల కరస్పాండెంట్ గంగారెడ్డి, డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పూర్ణచందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

● ఎరువుల దుకాణాల ఆకస్మికంగా తనిఖీ

● కలెక్టర్ సత్యప్రసాద్



మెట్‌పల్లిలో విత్తనాల దుకాణంలో స్టాకు వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్



విత్తనాల దుకాణంలోని స్టాకు వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్

మెట్‌పల్లి, జూలై, 12 : రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సత్యప్రసాద్ హెచ్చరించారు. శుక్రవారం మెట్‌పల్లి పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని విత్తనాలు, ఎరువులు, ఈ పాస్ మిషన్, అమ్మకాలకు సంబంధించిన పలు రికార్డులు పరిశీలించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడి రసీదులు అందజేయాలి, ఎరువులకు సంబంధించిన లైసెన్సులు అందరికి కనిపించేలా ఏర్పాటు, షాపులో ఉన్న స్టాక్ వివరాలను బోర్డుపై నమోదు చేయాలని సూచించారు. ఎరువుల విక్రయాలు ఈపాస్ మిషన్‌ద్వారానే జరపాలన్నారు. గోదాములోని స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేసిన, నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్‌లపైన కఠిన చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫర్టిలైజర్ దుకాణాదారులు రైతులకు నాణ్యత కలిగిన విత్తనాలు, ప్రతి ఎరువుల సంచి పీఓఎస్ మిషన్ ద్వారా మాత్రమే విక్రయించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవగాహన కల్పించాలన్నారు. ఈయన వెంటా ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయాధికారి వాణి, మండల వ్యవసాయాధికారి షాహిద్‌అలీ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించాలి

ఇబ్రహీంపట్నం: రైతులకు నాణ్యమైన విత్తనాలను అమ్మి ఖచ్చితంగా రసీదులు ఇవ్వాలని, రైతులకు అవసరమయ్యే ఫర్టిలైజర్ అందుబాటులో ఉంచి ఈ పాప్ ద్వార అమ్మకాలు జరుపాలని కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నం ప్రాథమిక సహకార సంఘం కార్యాలయంలో, ఇబ్రహీంపట్నం మండల పరిషత్ కార్యలయం లో ఆయన ఆకస్మీకంగా తనీఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫర్టిలైజర్ ఈ పాస్ ద్వారనే అమ్మకాలు జరుపాలని సూచించారు. స్టాక్ రిజిస్టార్, బిల్ బుక్స్, లైసెన్స్‌లను పరిశీలించారు. రైతులకు రసీదు ఇచ్చి నాణ్యమైన విత్తనాలను అమ్మలని సూచించారు. అనంతరం గ్రామ శివారులోని మొక్కజోన పంటను పరిశీలించారు. కరెంట్ బిల్‌కు సంబంధించి జిరో బిల్‌లు ఎందుకు అప్‌డేట్ చేయడం లేదాని ప్రశ్నించారు. వెంటనే అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో రఘువ రన్, ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా వ్యవసాయధికారి వాణి, తహసీల్దార్ ప్రసాద్, మండల అధికారులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి

కోరుట్ల రూరల్ : డీలర్లు దుకాణాలలో నిలువ ఉన్న ఎరువుల రికార్డుల వివరాలను సక్రమంగా నిర్వహించాలని, రైతులకు అందిచిన ఎరువుల వివరాలను నమోదు చేయాలని దుకాణ యజమానులకు కలెక్టర్ సత్య ప్రసాద్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని అశోక్ ఆగ్రోస్‌ను జిల్లా వ్యవసాయ అధికారిణి వాణి, కోరుట్ల ఆర్‌డీవో ఆనంద్ కుమార్‌లతో కలసి ఆకస్మితికంగా తనిఖీ చేసారు. దుకాణంలో ఉన్న రికార్డులను పరిశీలించి వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుకాణంలో నిలువ ఉన్న ఎరువుల సంఖ్య రికార్డులలో ఉన్న నమోదు సరుకులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు దుకాణ దారుకలకు పలు సూచనలు సలహాలను అందించారు. ఎరువుల విక్రయాలు పూర్తిగా అన్‌లైన్ విధానంలోనే ఈ పాస్ మిషన్ ద్వార మాత్రమే జరుపాలన్నారు. ఈ పాస్‌లోని నిలువ గోదాములోని నిలువ ఎరువులతో సరి చూసి అన్‌లైన్ విదానంలోనే విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిషన్, ఎంపీడీవో రామకృష్ణ, మండల వ్యవసాయ అధికారిణి నాగమణిలతో పాటు పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, జూలై 12: ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో 7వ వార్డు కౌన్సిలర్ వేముల నాగలక్ష్మి-రాజేష్ ఆధ్వర్యంలో కరీంనగర్ సన్‌షైన్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం సీజన్‌లో ప్రతి ఒక్కరు ఆరోగ్యపరంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కరీంనగర్ నుంచి డాక్టర్లను తీసుకొచ్చి ఇక్కడ వైద్య శిబిరాన్ని నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇందారపు రామయ్య, కౌన్సిలర్లు, వేముల నాగలక్ష్మి, సంగనభట్ల సంతోషి, జక్కు పద్మ, గరిగె అరుణ, సయ్యద్ యూనస్, లయన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు జక్కు రవీందర్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు ఒజ్జల లక్ష్మణ్, రాజేష్, ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షులు రవీందర్, నరేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ధర్మపురి పట్టణంలోని ఎస్‌హెచ్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి శుక్రవారం మంచి స్పందన లభించింది. ధర్మపురి చుట్టు పక్క గ్రామాలకు చెందిన సుమారు 260 మంది పేషెంట్లకు కరీంనగర్ సన్‌షైన్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ సురేష్‌కుమార్, డాక్టర్ శిరీష, డాక్టర్ అపూర్వ ఉచితం వైద్య పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్, న్యూరో ఫిజీషియన్, కార్డి యోలా జిస్ట్ డాక్టర్లు బీపీ, జీఆర్‌బీఎస్, ఈసీజీ, 2 డీఈకో పరీక్షలు జరిపి, ఉచితంగా మందులు అందించారు.

యువతి ఆత్మహత్య

కోరుట్ల, జూలై 12 : నచ్చని పెండ్లి సంబంధం చూసి పెళ్లికి ఓప్పిస్తారన్న మనస్థాపంతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో శుక్రవార చోటు చేసుకుంది. కాలనీ వాసులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన జన్నారపు రుచిత(19) ఇటీవలే డిగ్రీ విద్యను పూర్తి చేసి ఇంటి వద్ద ఉంటుంగా తల్లిదండ్రులు యువతికి పెండ్లి సంబంధం మాట్లాడారు. తనకు ఇష్టం లేకున్నా పెండ్లి చేస్తున్నారని మనస్థాపంతో రుచిత ఇంట్లో ఎవరు లేని సమయంలో ప్యాన్‌కు ఉరి వేసుకోని ఆత్మహత్య చేసుకున్నట్లు వారు తెలిపారు. భయటకు పోయిన తల్లి రాజకుమారి ఇంటికి వచ్చే వరకు ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఉన్నట్లు చేసి చట్టుపక్కల వారికి తెలిపింది దీంతో కాలనీ వాసులు పోలీసులకు సమాచారం అందించారు. రుచిత తల్లి జన్నారపు రాజకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలంను కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్ పరిశీలించారు.

పంటలు పండాలని దేవతా మూర్తులకు జలాభిషేకం

మల్లాపూర్, జూలై, 12 : సమృద్ధిగా వానాలు కురిసి పంటలు పండాలని కోరుతూ మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట గ్రామంలోని రైతులు శుక్రవారం దేవతా మూర్తులకు రైతులు, గ్రామస్థులు జలాభిషేకం చేశారు. ప్రతి యోటా రైతులు మక్కలు వేసిన కొన్ని రోజులకు సమీపన గల గోదావరి నదికి వెళ్లి సాహ్నములు చేసినంతరం నీటి బిందెలను శిరస్సుపై పెట్టుకొని డప్పు చప్పుల్ల మధ్య గ్రామానికి చెరుకున్నారు. గ్రామంలోని దేవతా మూర్తులకు తీసుకొచ్చిన నదిజాలలతో అభిషేకం చేశారు. అనంతరం ఆయా కుల సంఘాల నాయకులు మహాలక్ష్మి ఆలయంకు డప్పు చప్పుల మధ్య చేరుకోని బలిహారణ చేసి మొక్కులు చేశారు. గ్రామంలో వర్షాలు కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కుల సంఘాలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, జూలై 12 : మండలంలోని తిప్పయ్యపల్లి మాజీ సర్పంచు డేవిడ్ సోలోమోన్ సుమారు ఐదు రోజుల క్రితం గుండె పోటుకు గురికాగా శుక్రవారం సాయంత్రం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్, నాయకులు బైరి వెంకటి, రాజేశం, కొత్తూరి స్వామి, శ్రీనివాస్, పర్షరాం ఉన్నారు.

దంత వైద్య శిబిరం

జగిత్యాలఅర్బన్, జూలై 12: పట్టణంలోని స్థానిక ఓల్డ్ హై స్కూల్ మరియు భవిత పాఠశాల వికలాంగుల విద్యార్థులకు ఏవీపీఆర్ దంత వైద్యశాల అధినేత డాక్టర్ శైలేందర్ రెడ్డి ఉచిత దంత పరీక్షలు నిర్వహించి మందులు, పేస్టులు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోజుకు రెండుసార్లు బ్రష్ చేసుకోవాలని, పళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. వైద్యశిబిరాన్ని సందర్శించిన మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య ఏవీపీఆర్ అందిస్తున్న ఉచిత క్యాంపుల వివరాలు తెలుసుకొని అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళతో ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

రెండు లక్షల బీమా చెక్కు అందజేత

బుగ్గారం, జూలై 12: మండలంలోని గోపులపూర్ గ్రామానికి చెందిన దావనందుల తిరుపతి గత నేలలో అనారోగ్యంతో చనిపోగ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన స్కీమ్ ద్వారా భీమా చేసుకోగా వారి భార్య నామిని లక్ష్మికి శుక్రవారం బుగ్గారం బ్రాంచ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మెనేజర్ గిరి బాబు 2 లక్షల బీమా చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా మేనేజర్ మాట్లడుతూ మండలంలోని అన్ని గ్రామాల రైతులు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పేట్టిన భీమా పథకాలను సద్వీని యోగం చేసుకోవాలని అన్నారు. కుటుంబ యాజమని చనిపోతే బీమా భీమా అర్థికంగా అండగా ఉంటుందని అనారు. బీసీ పాయింట్ నిర్వహకులు మీల్కురి వసంత,చీట్ల సనత్, శ్రీనివాస్‌రావు పాల్గోన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

ఎల్లారెడ్డిపేట, జూలై 12: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు నాబార్డ్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ దిలీప్‌చంద్ర అన్నారు. మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవనంలో నాబార్డ్ సహకారంతో స్పందన సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళలకు మగ్గంపై శిక్షణ ముగింపు కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీఎం దిలీప్‌చంద్ర మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు నాబార్డ్ ద్వారా వివిధ అంశాలపై శిక్షణ కల్పిస్తోందని అన్నారు. కుట్టు, మగ్గం, తదితర రంగాల్లో మెలకువలను నేర్పించడంతో పాటు రుణం అందిస్తోందని అన్నారు. మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని అన్నారు.

కస్తూరిబా పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



ప్రదానోపాధ్యాయురాలుని వివరాలు అడుగుతున్న ఎమ్మెల్యే సంజయ్

కోరుట్ల రూరల్, జూలై 12 : కస్తూరిభా పాఠశాలలో మౌలిక వసుతుల కల్పన కోసం కృషి చేస్తానని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కల్లూర్ గ్రామ శివారులోని కస్తూరిభా పాఠశాలను సందర్శించి పాఠశాలలో ఉన్న సమ్యస్యలను ప్రత్యేక అధికారి సుమలతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పాఠశాలలో నెలకొన్న సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి తీసుకపోయి వసతులు కల్పనకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వనతడుపుల అంజయ్య, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

డీఈఓ పరిశీలన..

కస్తూరిభా పాఠశాలను శుక్రవారం జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్ రెడ్డి పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనుల వివరాలను పాఠశాల ప్రత్యేక అధికారి సుమలతను అడిగి తెలుసుకున్నారు. పనులు వేగవంతగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థులకు ఎలాంటి అటకం కలుగకుండా చూడాలని కంట్రాక్టర్‌కు విద్యాధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, ఎంఈవో నరేశంలతో పాటు పలువురు పాల్గొన్నారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ టీచర్ మృతి

ఎల్లారెడ్డిపేట, జూలై 12: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్‌కు చెందిన అంగన్‌వాడీ టీచర్ ఎర్ర శశిరేఖ (55) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శశిరేఖ గంభీరావుపేట మండలం సముద్ర లింగాపూర్‌లో అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. పది రోజుల కిందట అనారోగ్యానికి గురయ్యారు. మెరుగైన వైద్యం అందించేందుకు కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. మెదడులో రక్తనాళాలు చిట్లిపోవడంతో మృతి చెందింది.

ఇంటింటా ఐదు మొక్కలు నాటాలి

తంగళ్లపల్లి, జులై 12: ప్రతీ ఇంటి ఆవరణలో ఐదు మొక్కలు నాటి వన మహోత్సవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఎంపీడీవో లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. తంగళ్ళపల్లి మండలంలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మనోహత్సవ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీల నాయకులు, మహిళా సంఘాలు, యువజన సంఘాలు భాగస్వాము లు కావాలని కోరారు. మండల కేంద్రంలోని మొక్కల పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల గం ప్రవీణ్, చిన్న లింగాపూర్‌లో బైరనేని రాము ఆయా గ్రామాల్లో భాగస్వా ములయ్యారు. కార్యక్రమంలో ఎంపీవో జోగం రాజు, ఏపీవో రాజనర్సు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన గురువులకు సన్మానం

రాయికల్, జూలై 12: మండలంలోని రామాజీపేట ప్రాథమిక పాఠశాలలో పని చేసి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు శుక్రవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన పాఠశాల ఉపాధ్యాయులు అనిత, సుజాత, కల్పన రాధలకు పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఆలూరు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుడు కిషోర్‌కు గ్రామస్థులు ఘనంగా సన్మానం చేశారు. తమకు విద్య నేర్పిన గురువులు బదిలీపై వెళ్లడంతో కన్నీటితో వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయులు వినోద్, సుమలత, నరేష్, జయదేవ్ వర్మ, రమేష్, అఖిల, మాజీ సర్పంచ్, ఎంపీటీసీలు భాస్కర్ రావు, సురేందర్‌రెడ్డి, మెక్కొండ రాంరెడ్డి, ఉపాధ్యాయులు ఉదయభాస్కర్, సతీష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

భీమారం: బదిలీపై వెళ్తున్న మండలంలోని వెంకట్రావుపేట మండల పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను జిర్ఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సుంకె రజిత, శంకర్, లక్ష్మి, ఈశ్వర్‌లను శాలువాలతో సత్కరించి, వారు పాఠశాలకు అందించిన సేవలను పలువురు కొని యాడారు. అలాగే పాఠశాలకు బదిలీపై వచ్చిన భీమయ్య, అజయ్‌లను కూడా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిర్ఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అంగడి ఆనంద్ కుమార్, ఆర్ఐ రాజా రం, తాజా మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ, జగన్ రెడ్డి, భూమేష్ గౌడ్, దీపక్, ఉపాధ్యాయు రాలు మౌనిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యా ర్థులు పాల్గొన్నారు.

వర్షాల కోసం వరదపాశం

మల్యాల, జూలై 12: మండలంలోని ముత్యంపేటలో శుక్రవారం రైతులు వరదపాశం కార్యక్రమం నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని వేడుకుంటూ గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బిందెలతో తీసు కువచ్చిన జలాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. అనంతరం దిగువ కొండగట్టులో ఘాట్ రోడ్డు, మెట్ల మార్గం సమీపంలో పూజలు నిర్వహించారు. వర్షాలు బాగా కురవాలని పంటలు బాగా పండాలని వేడుకున్నారు.

రాష్ట్రంలో విద్య, వైద్యానికి పెద్ద పీట

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



కల్యాణ లక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

బీర్‌పూర్, జూలై 12: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హయాంలో విద్యా, వైద్యానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి 20 లక్షలు, తాళ్లధర్మారం గ్రామంలో ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి 20 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ కార్యక్రమంలో భాగంగా పల్లె దావఖానా నిర్మాణానికి ఎమ్మెల్యే రెండు గ్రామాలలో పల్లె దావఖానాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బీర్‌పూర్ మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో మండలానికి చెందిన 20 మంది ఆడబిడ్డలకు 20 లక్షల విలువ గల కల్యాణ లక్ష్మీ చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజి ఏర్పాటుతో సూపర్ స్పెషలిటి వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. బీర్‌పూర్ మండల కేం ద్రంతో పాటు కొల్వాయి, తాళ్లధర్మారం గ్రామాలకు పల్లె దవాఖానాతో పాటు 108 అంబులెన్స్ కూడా మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్ రావ్, తహసీల్దార్ నరేష్, ఎంపీడీవో లచ్చాలు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, రెవెన్యూ పరిశీలకులు శ్రీనివాస్, ఎంపీవో రామకృష్ణ రాజు, సూపరింటెండెంట్ రాజమౌలి పాల్గొన్నారు.